www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 27 డిసెంబర్ 2023

నేడు ఎంఎస్ఎన్‌లో స్పాట్ అడ్మిషన్స్

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల్లో ఎడ్మిషన్ కోసం బుధవారం స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపల్ ఎస్.ప్రశాంతి తెలిపారు. అధునాతన సదుపాయాలతో కూడిన ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో కంప్యూటర్ ల్యాబ్, ప్లేస్‌మెంట్ సెల్, ఎన్ఎస్ఎస్, హాస్టల్ ఫెసిలిటీ, లైబ్రరీ క్రీడా ప్రాంగణం ఉన్నాయన్నారు. విద్యార్థులు 27న రాజమహేంద్రవరం మెయిన్ క్యాంపస్‌లో స్పాట్ అడ్మిషన్స్‌లో పాల్గొనాల్సిందిగా సూచించారు. హెచ్ఒడిలు డాక్టర్ డి.అజయ్ రతన్ 9502228676, కె.వరప్రసాద్ 7898363337, అడ్మిషన్స్ సెక్షన్ అబ్దుల్ కరీం 9701827564, ఆదికవి నన్నయ యూనివర్సిటీ అఫీషియల్ వెబ్సైట్ www.aknu.edu.in సంప్రదించాల్సిందిగా పేర్కొన్నారు.

నేటి నుంచి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు

రాష్ట్రం నలుమూలల నుంచి ప్రతినిధులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఈ నెల 27, 28, 29 తేదీల్లో స్థానిక అంబేద్కర్ భవన్‌లో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ 24వ రాష్ట్ర మహాసభలకు కాకినాడ ముస్తాబైంది. సభలు జరగనున్న ప్రాంతానికి అల్లూరి సీతారామరాజు నగర్, ధీరజ్ ప్రాంగణంగా నామకరణం చేశారు.

మహాసభల సందర్భంగా నగరంలోని పలు కూడళ్లలో ఎస్ఎఫ్ఐ జెండాలు, బ్యానర్లు, తోరణాలతో అలంకరించారు. మెయిన్ రహదారుల వెంబడి హోర్డింగులు ఏర్పాటు చేశారు. వాల్ పెయింటింగ్స్ ద్వారా ప్రచారం చేపట్టారు. ఇలా మహాసభలకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా కమిటీ నాయకులు తెలిపారు. 26 జిల్లాల నుంచి 500 మంది ప్రతినిధులు ఈ మహాసభల్లో పాల్గొని విద్యారంగ సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించనున్నారు.

మొదటిరోజు బుధవారం ఉదయం 10 గంటలకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం జెండాను ఆవిష్కరించి రాష్ట్ర మహాసభలను ప్రారంభిస్తారు. అనంతరం అమర వీరులైన అల్లూరి సీతారామరాజు, ధీరజ్, ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఎంఎల్‌సి షేక్ సాబ్జి, మల్లు స్వరాజ్యం తదితరుల అమరులకు నివాళులు అర్పిస్తారు. అనంతరం 24వ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షుడు జెఎన్‌టియుకె విసి ప్రొఫెసర్ జివిఆర్ ప్రసాద్ రాజు, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావులు ప్రారంభ సభలో ప్రసంగిస్తారు. పిడిఎఫ్ మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం ముఖ్య వక్తగా మాట్లాడతారు. అనంతరం రాష్ట్రంలో వివిధ సందర్భాల్లో జరిగిన విద్యార్థి ఉద్యమాలపై రాష్ట్ర కార్యదర్శి నివేదిక ప్రవేశపెడతారు. అన్ని జిల్లాల వారీగా ప్రతినిధులు గ్రూపు చర్చల్లో పాల్గొంటారు.

రెండో రోజు విద్యార్థులు, గిరిజనులు, సోషల్ మీడియా, సంక్షేమ హాస్టళ్లు, కేంద్రీకరించిన కళాశాలలు, కమిటీలు వంటి రంగాల వారీగా మహాసభల్లో చర్చలు జరుగుతాయి. ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు ముఖ్య వక్తగా పాల్గొంటారు. మూడో రోజు భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించడంతో బాటు భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరిస్తారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఆనంద భారతి గ్రౌండ్ నుంచి మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్ వరకు విద్యార్థి కవాతు, 5 వేల మందితో భారీ ప్రదర్శన జరగనుంది. ఈ సందర్భంగా విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర, అఖిలభారత నాయకులు విద్యారంగ సమస్యలపై మాట్లాడతారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను వివరిస్తారు. నూతన జాతీయ విద్యా విధానం వల్ల కలిగే నష్టాలపై మాట్లాడతారు.

ఏర్పాట్లలో నిమగ్నమైన వాలంటీర్లు

పట్టణంలోని కూడలిలో జెండాలు

ముస్తాబైన సభా ప్రాంగణం

ప్రజా సంక్షేమమే లక్ష్యం : మంత్రి రాజా

ప్రజాశక్తి-కోటనందూరు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. కె.చిన్నపాలెంలో మాజీ లావా దేవస్థానం చైర్మన్ లాలం బాబ్జి ఆధ్వర్యంలో నిర్వహించిన డి.పట్టాలను పంపిణీ, కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ పరిపాలన సంక్షేమం, అభివద్ధిలో అగ్రగామిగా నిలిచిందన్నారు. రాజకీయ పార్టీలకతీతంగా అన్ని సామాజిక వర్గాలనూ ఆర్థికంగానూ, రాజకీయంగా అభివృద్ధి చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నారు. విద్య, వైద్య రంగాల్లో పెను మార్పులు తీసుకువచ్చి ప్రజలకు సేవ చేస్తున్నామని చెప్పారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ జగన్ ప్రభుత్వంపై అసత్యాలను ప్రచారం చేస్తున్నారని, ప్రజలు వారిని నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. నాలుగున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోలో 90 శాతాన్ని అమలు చేసినట్టు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి లగుడు శ్రీనివాస్, తుని మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ వెలగా వెంకట కృష్ణాజీ, గుడ్ల సత్తిబాబు, గొర్ల రామచంద్ర రావు, జగటాలకోట సత్తిబాబు, బండి నానిబాబు, చింతకాయల చినబాబు, పాల్గొన్నారు.

పట్టాలను పంపిణీ చేస్తున్న మంత్రి రాజా

విద్యార్థుల్లో ప్రతిభకు ప్రోత్సాహం

ప్రజాశక్తి-కాకినాడ

విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తోందని ఎంపీ వంగా గీత చెప్పారు. గాంధీనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కూడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి తదితరులతో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం సైన్స్ ఎగ్జిబిషన్‌లో భాగంగా విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టులను కలెక్టర్ కతికా శుక్లా పరిశీలించారు. తొలుత జాతీయ పతాకాన్ని ఎగురవేసి, డాక్టర్ సివి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ ఇప్పుడు చదువుకుంటున్న విద్యార్థులు చాలా అదృష్టవంతులని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ మనబడి నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. ప్రతి విద్యార్థి ఏదో ఒక ప్రతిభ కలిగి ఉంటారని ఆ ప్రతిభను గుర్తించి, ప్రదర్శించి, ప్రోత్సహించే దిశగా అనేక నూతన కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం నాంది పలికినట్లు ఆమె తెలిపారు. పాఠశాల స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయిలో విద్యను అభ్యసించే గొప్ప అవకాశాన్ని సిఎం విద్యార్థులకు కల్పిస్తున్నారన్నారు. అబ్దుల్ కలాం వంటి వ్యక్తులు పేద కుటుంబానికి చెందిన సాధారణ విద్యార్థే అయినప్పటికీ అణు రంగంలో ఉన్నత స్థాయికి ఎదగడంతో పాటు రాష్ట్రపతిగా సేవలందించారన్నారు. మేయర్ సుంకర శివ ప్రసన్న, విద్యాశాఖ ఆర్‌జెడి జి.నాగమణి, పశుపులేటి వెంకట లక్ష్మి, డివైఇఒలు ఆర్‌జె.డానియల్ రాజ్, డి.సుభద్ర, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినీల్, జి.దుర్గాప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎంపీ గీత, కలెక్టర్, ఎంఎల్ఎ

వైసిపికి పలువురి రాజీనామా

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్, కిర్లంపూడి

జగ్గంపేట నియోజకవర్గంలో వైసిపికి భారీ షాక్ తగిలింది. వచ్చే ఎన్నికల్లో ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబుకు టికెట్ నిరాకరించడంతో పలువురు ఆయన అనుచరులు మంగళవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. మండల కేంద్రమైన జగ్గంపేట మార్కెట్ కమిటీ భవనంలో విలేకరుల సమావేశంలో ఎఎంసి చైర్మన్ జనపరెడ్డి బాబు మాట్లాడారు. తమ పార్టీ తమకే చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయడం లేదన్నారు. పార్టీపై విసుగు చెంది రాజీనామా చేస్తున్నామని తెలిపారు. వైసిపి గండేపల్లి మండల అధ్యక్షుడు కందుల చిట్టిబాబు మాట్లాడుతూ తాను కేవలం ఎంఎల్ఎ చంటిబాబు కోసమే వైసిపిలోకి వచ్చానన్నారు. గండేపల్లి జెడ్‌పిటిసి పరిమి మంగతాయారు భర్త సత్యనారాయణ మాట్లాడుతూ చంటిబాబు మీద అభిమానంతోనే వైసిపిలోకి వచ్చామని, త్వరలో టిడిపిలో చేరతామని తెలిపారు. రాజీనామా చేసిన వారిలో మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, కిర్లంపూడి ఎంపిపి తోట రవి, కిర్లంపూడి జెడ్‌పిటిసి తోట సత్యవతి గాంధీ, గండేపల్లి జెడ్‌పిటిసి పరిమి మంగతాయారు సత్యనారాయణ కందుల చిట్టిబాబు ఉన్నారు.



వైసిపికి రాజీనామా చేసిన నాయకులు

సమస్యలపై మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం పెద్దాపురం మున్సిపల్ వర్కర్స్ సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి శివకోటి అప్పారావు మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్‌కు సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమానమేతనం ఇవ్వాలని, మున్సిపల్ కాంట్రాక్టు (ఆప్కాస్) కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, వారిని పర్మినెంట్ చేయాలని, పండగ సెలవులు, వారాంతరపు సెలవులు అమలు చేయాలని, ఇంజినీరింగ్ కార్మికులకు రిస్కు, హెల్త్ అలవెన్స్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి అధికారంలోకి రాక ముందు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వర్కర్లను పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చారన్నారు. నాలుగున్నరేళ్లు గడిచినా ఇప్పటివరకు ఇచ్చిన హామీని అమలు చేయలేదన్నారు. కరోనా సమయంలో మున్సిపల్ వర్కర్ల కాళ్లు కడిగి నీళ్లు నెత్తిన చల్లుకోవాలని చెప్పిన ముఖ్యమంత్రికి వారికి కనీస వేతనాలు ఇవ్వాలని గుర్తు లేదా అని ప్రశ్నించారు. మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తానని చెప్పిన ప్రభుత్వం అమలు చేయకుండా మున్సిపల్ కార్మికులను మోసం చేసిందన్నారు. తమ సమస్యల పరిష్కారమయ్యేంతవరకు సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిరపరపు శ్రీనివాస్, యూనియన్ నాయకులు వర్రే గిరిబాబు, శేఖర్, చేపల శ్రీను, సింగంపల్లి సింహాచలం, సురేష్, రాజేష్, గంటా రమణ, బాసిన భద్రరావు, గంగా భవాని, నీలం నూకరత్నం, వర్రే వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కంచాల మోతతో అంగన్‌వాడీల నిరసన

అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారం 15వ రోజుకు చేరింది. కంచాలు మోగిస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. వారికి పలు పార్టీలు, సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రావతి శిబిరాన్ని ప్రారంభించారు. ముమ్మిడివరం ప్రాజెక్టులో ఇటీవల మరణించిన హెల్పర్ సుగుణమ్మకు శిబిరంలో నివాళులర్పించారు. యుటిఎఫ్ నాయకులు శ్రీనివాసరావు, బలరామకృష్ణ, ఎస్‌టియు నాయకుడు సుబ్బరాజు సమ్మెకు మద్దతు తెలిపారు. వై.శ్రీవల్లి, జి.రమణమ్మ, జ్యోతి, రామ, మున్ని, విజయ పాల్గొన్నారు.

జగ్గంపేట రూరల్ చెవిలో పువ్వులు పెట్టుకుని, కంచాలు మోగిస్తూ నినాదాలు చేశారు. రత్నం, సుజాత పాల్గొన్నారు.

పిఠాపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద విజయశాంత, వెంకట లక్ష్మి మాట్లాడారు. సమ్మెకు రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోనేటి రాజు, సూర్యనారాయణ, ఎ.రాజు, అప్పారావు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు రమాదేవి, ఎం.పద్మ, అప్పలరాజు, వరలక్ష్మి, కరుణ, నళిని, అమల, భవాని, వెంకటలక్ష్మి, సూర్యకాంతం, ఒ.సత్యవతి పాల్గొన్నారు.

పెద్దాపురం కంచాలు మోగిస్తూ నిరసన తెలిపారు. టి.నాగమణి, దాడి బేబీ మాట్లాడారు. నాగమణి, అమల, టిఎల్ పద్మావతి, కాలే దేవి, జె.సూర్య కుమారి, జ్యోతి, లోవ తల్లి, వసంత మారి, వెంకటలక్ష్మి, నాగమణి, సావిత్రి, లక్ష్మి, రత్నం, మహాలక్ష్మి, లోవ కుమారి, మంగా లక్ష్మి, రజిని, స్నేహలత పాల్గొన్నారు.

తాళ్లరేవు కంచాలపై గరిటలతో కొడుతూ నిరసన తెలిపారు. పి.ఆదిలక్ష్మి, ఉషారాణి, శ్రీదేవి, పార్వతి పాల్గొన్నారు. సమ్మెకు అమలాపురం మాజీ ఎంపీ జివి.హర్షకుమార్ మద్దతు తెలిపారు. ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు, వంగా శ్రీనివాస్, వరలక్ష్మి, హనుమావతి, అన్నవరం, రాయుడు సీత, కాదా సుజాత, ప్రత్తి ప్రసన్న పాల్గొన్నారు.

పెదపూడి సిఐటియు నాయకురాలు రాజేశ్వరి ఆధ్వర్యంలో కంచాలు, గరిటెలతో నిరసన తెలిపారు. ఎస్.కనకదుర్గ, వి.భారతి, బాంధవి, ఎస్.చాందిని, ఎ.శాంతరత్నం, మేరీ రత్నం, నాగేంద్రమణి, అరుణ పాల్గొన్నారు.

కరప అంగన్వాడి ప్రాజెక్టు నాయకురాలు పి.వీరవేణి మాట్లాడారు. ఎస్.వరలక్ష్మి, ఎస్ఎస్.కుమారి, దైవ కుమారి, ఆశారత్నం, కల్పలత, హెల్పర్ సత్య మాధవి, ఎం.భవాని, నారాయణమ్మ, మంగతాయారు, సరోజిని, జ్యోతి, కల్పలత, పి.లక్ష్మి, ఎ.దేవి, బి.మనోజ, లక్ష్మి, సాయి దుర్గ, బి.భవాని పాల్గొన్నారు.

కాకినాడలో..

పిఠాపురంలో..

జగ్గంపేట రూరల్‌లో..

పెద్దాపురంలో..

29న సామాజిక సాధికార బస్సు యాత్ర

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఈ నెల 29న ముమ్మిడివరంలో సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ కోరారు. తాళ్లరేవులో జెడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్ స్వగృహం వద్ద కాదా గోవింద్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 29న ఉదయం 10 గంటలకు మహిపాల చెరువు వద్ద నుంచి ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాల వరకు 5 కిలోమీటర్ల మేర ఈ బస్సు యాత్ర సాగనుందని తెలిపారు. 11 గంటలకు బస్సు యాత్ర ఎయిమ్స్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన సభాస్థలికి చేరుకుంటుందన్నారు. 12.30 గంటలకల్లా సభ ముగుస్తుందన్నారు. ప్రతి కార్యకర్తా సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయడానికి పూర్తిస్థాయిలో కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి రాయుడు సునీత, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, ఎఎంసి చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, మాజీ జెడ్‌పి చైర్మన్ దున్న జనార్ధనరావు, కాశి లక్ష్మణస్వామి, రేవు మల్లేశ్వరి, అంకాడి అంజిబాబు, రెడ్డిబాబు వైసిపి నాయకులు తదితరులు ఉన్నారు.

కార్టూన్ 'నిజం'

వాలంటీర్ల సమ్మెకు సిఐటియు మద్దతు

ప్రజాశక్తి-కాకినాడ

వార్డు, గ్రామ సచివాలయాలల్లో పని చేస్తున్న వాలంటీర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని, ఉద్యోగభద్రత కల్పించాలని సిఐటియు కాకినాడ జిల్లా కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దువ్వా శేష బాబ్జి, చెక్కల రాజ్ కుమార్ మంగళవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను కట్టుబానిసల్లా పని చేయించడాన్ని వ్యతిరేకిస్తూ సచివాలయ వాలంటీర్లు డిసెంబర్ 29 నుండి నిర్వహించబోయే సమ్మెకు సిఐటియు జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ఇస్తోందన్నారు. నాలుగున్నరేళ్లుగా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వాలంటీర్లు పని చేస్తున్నా ఎటువంటి కనీస వేతనాలు, పని గంటలు, విధి విధానాలు లేకుండా పని చేయిస్తున్నారన్నారు. అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల వేధింపులు, తూల నాడడం, చులకన భావంతో చూడడం వంటి ఇబ్బందులకు గురవుతూ సేవలందిస్తున్నారన్నారు. అనేక ఇబ్బందులకు ఓర్చి కోవిడ్ కాలంలో కూడా సేవలందించి కోవిడ్ బారిన కూడా పడ్డారన్నారు. పదుల సంఖ్యలో కోవిడ్‌తో చనిపోయారన్నారు. ప్రభుత్వం వాలంటీర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. గౌరవ వేతనం పేరిట అగౌరవంగా అతి తక్కువ వేతనాలతో రాష్ట్ర ప్రభుత్వం పని చేయించుకుంటుందన్నారు. వాలంటీర్లను కట్టు బానిసలుగా చూస్తూ రాష్ట్ర ప్రభుత్వం పని చేయించుకుంటోందన్నారు. వాలంటీర్ల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయన్నారు.

7వ రోజు సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-కాకినాడ, సామర్లకోట రూరల్

తమ సమస్యలపై ఏడు రోజులుగా ఆందోళన చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు మంగళవారం భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యా శాఖలో పని చేసే సర్వ శిక్ష కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, మినిమం టైమ్ స్కేల్ ప్రకారం వేతనాలు చెల్లించాలని, పెండింగ్ వేతనాలను తక్షణం చెల్లించాలని, జగన్ ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు వారికి పెద్ద ఎత్తున మద్దతు తెలిపారు. జెఎసి జిల్లా అధ్యక్షుడు ఎం.చంటిబాబు, జిల్లా కార్యదర్శి నాగమణి, జిల్లా ఉపాధ్యక్షులు పివివి మహాలక్ష్మి, ఎ.లోవరాజు, సహాయ కార్యదర్శులు జి.నారాయణ, శ్రీనివాస్, జిల్లా కోశాధికారి పి.రాజు, ఎం.గంగాధర్, రాధాకృష్ణ పాల్గొన్నారు. సామర్లకోట రూరల్‌లో సమగ్ర శిక్ష ఉద్యోగులు దీక్షలు చేపట్టారు.

కాకినాడలో భిక్షాటన చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సామర్లకోటలో దీక్షలో పాల్గొన్న ఉద్యోగులు

నేటి నుంచి సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-కాకినాడ

మహిళలకు పనుల ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించేందుకు వైసిపి ఆధ్వర్యంలో జగనన్న సంక్రాంతి సంబరాలు ఆడండి-గెలవండి పేరిట నిర్వహిస్తున్నామని సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి తెలిపారు. స్థానిక డి-కన్వెన్షన్ హాల్లో మంగళవారం ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ పరిధిలోని 84 సచివాలయాల్లో మహిళలకు మూడు రకాల ఆటలు పోటీలు నిర్వహిస్తామన్నారు. ముగ్గులు, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్, తదితర పోటీలు నగరంలోని నాలుగు ప్రాంతాల్లో నిర్వహిస్తామన్నారు. మొదటి బహుమతి గ్రైండర్, రెండు కుక్కర్ ఉంటాయని, క్లస్టర్ వారిగా పోటీలు ఉంటాయన్నారు. నాలుగు ప్రాంతాల్లో మహిళలు పోటీలు ఉంటాయి. దాదాపు రూ.35 లక్షల విలువైన బహుమతులు అందిస్తామన్నారు. ఉదయం ఆటలు, సాయంత్రం ముగ్గుల పోటీల్లో నగర మహిళలు పాల్గొనాలని వారు కోరారు. సచివాలయాల వారీగా గెలిచిన విజేతలకు జనవరి 10న ఆనందభారతి గ్రౌండ్‌లో గ్రాండ్ ఫైనల్ రోజున బహుమతులు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

నేరాలు ఘోరాలు

మృతి చెందిన యువకులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని జె.కొత్తూరులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గంపేట నుంచి రాజపూడి వెళుతుండగా రాజపూడి గ్రామానికి చెందిన కోన సత్తిబాబు (36), గోకవరం నుంచి జగ్గంపేట వస్తున్న కర్రి రాజకుమార్ రెడ్డి (21) ఎదురెదురుగా బైకులతో బలంగా ఢీ కొనడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. సత్తిబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా, రాజ్ కుమార్‌కు వివాహం కావాల్సి ఉంది. మృతదేహాలను పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

బీచ్ రోడ్డులో కారు బోల్తా..

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

బీచ్ రోడ్డులో మంగళవారం ఒక కారు బోల్తా పడిన సంఘటనలో పలువురు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. పిఠాపురానికి చెందిన ఒక కుటుంబం యు.కొత్తపల్లి మండలం కొండేవరం బంధువుల ఇంటికి వచ్చారు. అక్కడి నుంచి బీచ్‌కు బయల్దేరారు. ఉప్పాడ సుబ్బంపేట బీచ్ రోడ్డు సమీపంలో కారు రాళ్ల గుట్టను ఢీకొని ప్రమాదవశాత్తు బోల్తా పడింది. స్థానికులు పరుగు పరుగున అక్కడికి చేరుకుని కారులో ఉన్న మహిళ, చిన్నారితో పాటు ఇద్దరి సురక్షితంగా బయటికి తీశారు. వారిని వేరే వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలోని యల్లమెల్లి గ్రామ శివారులో విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. గ్రామానికి చెందిన బొట్ల వీరబాబు (33) యువకుడు గ్రామ శివారులో మృతి చెంది ఉండడంతో చూసిన స్థానికులు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి ఎస్ఐ వై.గణేష్‌కుమార్ చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

పసికందు హత్య కేసులో యావజ్జీవం

ప్రజాశక్తి - సీతానగరం

15 రోజుల పసికందు హత్య కేసులో నిందితునికి యావజ్జీవ శిక్ష విధిస్తూ 9వ అదనపు కోర్టు జడ్జి ఎం.మాధురి తీర్పు ఇచ్చారని పోలీసులు తెలిపారు. 2020లో పసికందును బావిలో పడేసి హత్య చేశారు. ఈ కేసుకు సంబంధించి అప్పటి కోరుకొండ సిఐ పవన్‌కుమార్‌రెడ్డి కేసు నమోదు చేశారు. గంధం కనకరత్నం, మలిరెడ్డి మహాలక్ష్మి, కాళ్ల సృజనలను నిందితులుగా గుర్తించారు. ఈ కేసులో ముగ్గురు నేరం చేసినట్టు రుజువైంది. ఈ కేసులో కనకరత్నం మతి చెందింది. శిశువు అమ్మమ్మ మలిరెడ్డి మహాలక్ష్మి, శిశువు తల్లి కాళ్ల సృజనలకు యావజ్జీవ ఖైదు, రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. కేసు దర్యాప్తులో ప్రస్తుత సిఐ ఉమామహేశ్వరరావు పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు, కోర్టు కానిస్టేబుల్ షరీఫ్ సాక్షాలను సకాలంలో కోర్టుకు అందించారు.

ధ్వంసం చేసిన మద్యం బాటిళ్ల వద్ద పోలీస్ అధికారులు

1,074 లీటర్ల మద్యం ధ్వంసం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

2019 ఏప్రిల్ నుంచి 2021 సెప్టెంబర్ మధ్యకాలంలో మండల పరిధిలో నమోదు చేసిన 57 కేసుల్లోస్వాధీనం చేసుకున్న మద్యం సీసాలను మంగళవారం పోలీసులు ధ్వంసం చేశారు. ఎస్‌పి ఎస్.శ్రీధర్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్‌పి, జిల్లా ఎస్ఇబి ఎస్. ఖాదర్ బాషా, అమలాపురం డిఎస్ పి ఎం.అంబికా ప్రసాద్, ఎస్ఇబి జి.గంగాధరరావు, స్థానిక ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు, పోలీస్, ఎస్ఇబి, రెవెన్యూ సిబ్బంది, మహిళా పోలీసుల సమక్షంలో స్వాధీనం చేసుకున్న 6018 మద్యం బాటిళ్లను రోడ్డు రోలర్ తో తొక్కించి ధ్వంసం చేశారు. ఈమద్యం విలువ సుమారు రూ.8.50 లక్షలు ఉంటుందని డిఎస్‌పి అంబికా ప్రసాద్ తెలిపారు.

11 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి-దేవరపల్లి

దేవరపల్లి మండలం యాదవోలులో ఎస్ఇబి సిబ్బంది మంగళవారం దాడులు నిర్వహించారు. అక్రమంగా 11 మద్యం సీసాలను కలిగివున్న కూనాపం ఏడుకొండలు అదుపులోకి తీసుకున్నారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ డి.సుధ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ పి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

అట్టహాసంగా ఆడుదాం ఆంధ్రా ప్రారంభం

'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని మంగళవారం జిల్లావ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ రూరల్ వాకలపూడిలోని జెడ్‌పి పాఠశాల్లో కాకినాడ రూరల్ ఎంఎల్‌ఎ కురసాల కన్నబాబు, జాయింట్ కలెక్టర్ ఇలాక్కియ ప్రారంభించారు. జాతీయ పతాకాన్ని, క్రీడా పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించారు. వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో కోర్టులను ప్రారంభించారు. జమ్మలమడక నాగమణి, జెడ్‌పిటిసి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** ఎంఎల్‌ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ఒమ్మంగి గ్రామంలో క్రీడలను ప్రారంభించారు. జెడ్‌పిటిసి బెహరా రాజరాజేశ్వరి, బెహరా దొరబాబు, గొంతిన సురేష్ పాల్గొన్నారు. **తాళ్లరేవు** ఎంపిపి రాయుడు సునీత గంగాధర్ క్రీడలను ప్రారంభించారు. జెడ్‌పిటిసి దొమ్మేటి సాగర్, తహశీల్దారు పోతురాజు, ఎంపిడిఒ ఎం.అనుపమ పాల్గొన్నారు. **కిర్లంపూడి** వీరవరంలో ఎంపిడిఒ బడే రాజేశ్వరరావు క్రీడలను ప్రారంభించారు. **సామర్లకోట రూరల్** హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడలను ప్రారంభించారు. జెడ్‌పిటిసి సూరిబాబు, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, ఆవాల లక్ష్మీనారాయణ, కౌన్సిలర్‌లు పిట్టా సత్యనారాయణ, పాలిక కుసుమ చంటిబాబు పాల్గొన్నారు. **పెద్దాపురం** మహారాణి కళాశాలలో పోటీలను వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ప్రారంభించారు. లూథరన్ హైస్కూల్లో పోటీలను చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి ప్రారంభించారు. జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు పాల్గొన్నారు. **కోటనందూరు** ఎంపిపి ఎల్.శ్రీనివాస్ క్రీడలను ప్రారంభించారు. **జగ్గంపేట రూరల్** వైసిపి రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురామ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడలను ప్రారంభించారు. ఎంపిపి అత్తులూరి నాగబాబు, ఎంపిడిఒ వసంత్ కుమార్, ఇఒపిఆర్ డి.కొండలరావు, ఇఒ గణేష్ బాబు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్‌లో..

జగ్గంపేట రూరల్‌లో..

ఏలేశ్వరంలో..

185 మంది పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి-పెదపూడి

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్‌ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. వేండ్ర గ్రామంలో మంగళవారం పేదలకు ఆయన ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వేండ్ర, చింతపల్లి గ్రామాలకు సంబంధించి సుమారు 185 మందికి విలువైన ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశామన్నారు. సిఎం వైఎస్.జగన్ రాష్ట్రంలో 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. ప్రతి పేదవాడు ఇంటి స్థలం పొంది, ఇల్లు నిర్మించుకోవాలని రూ.1.80 లక్షల రుణం కూడా అందజేస్తున్నారన్నారు. పార్టీలు, కులాలు, మతాలలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. జగన్ మళ్లీ సిఎంగా రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, చింతపల్లి సర్పంచ్ కొల్లు లోవకుమారి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిపి కేతా తులసి, జెడ్‌పిటిసి పేపకాయల వెంకటలక్ష్మి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సబ్బెళ్ల అమ్మిరెడ్డి, నర్ల సాంబమూర్తి, చింతా దొరబాబు, త్రిమూర్తులు, పేపకాయల సూర్యనారాయణ, కరెడ్ల వెంకన్నబాబు, మోర్త శ్రీను, ఎన్.గంగరాజు పాల్గొన్నారు.

పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంఎల్‌ఎ సూర్యనారాయణరెడ్డి

రూ.6 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి - తాళ్లరేవు

జి.వేమవరం పంచాయతీ శ్రీరామ నగర్, మట్లపాలెంలో రూ.6 లక్షల మండల పరిషత్ నిధులతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఎంపిపి రాయుడు సునీత గంగాధర్ మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఆకాంక్షల మేరకు గ్రామాభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, ఎంపిటిసి యర్రంనీడి అప్పారావు, ఉప సర్పంచ్ మట్ట లింగమూర్తి, గండి రామాంజనేయులు, నీలపాల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సుధారాణి పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి సునీత

ఫుట్‌బాల్ పోటీలకు ఆదిత్య విద్యార్థి

ప్రజాశక్తి-కాకినాడ

ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థి జి.నవీన్ కుమార్ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఫుట్ బాల్ పోటీలకు ఎంపికైనట్టు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ అంతర కళాశాలల పురుషుల ఫుట్‌బాల్ పోటీలు, ఎంపికల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నవీన్ కుమార్ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు గోల్‌కీపర్‌గా ఎంపికయ్యాడని తెలిపారు. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు తమిళనాడు ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో సౌత్ జోన్ ఫుట్బాల్ టోర్నమెంట్ జరగనుందని తెలిపారు. నవీన్ కుమార్‌ను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి, స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేష్, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఇన్‌ఛార్జి మూర్తి, పీడీ ఉదయ్ అభినందించారు.

ఆరోగ్య కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రతి ఒక్కరు కేంద్ర సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకోవాలని మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్ అన్నారు. వికసిత్ భారత్ ప్రచార యాత్రలో భాగంగా మంగళవారం గుడివాడ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ పథకాలకు అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏటుకూరి సూర్యనారాయణ రాజు, విత్తనాల వెంకటరమణ, దుర్గా మోహన్ రావు, కరెడ్ల దేవి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణకు పార్టీలు సహకరించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో నిర్వహిస్తున్న ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ కు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహాయ సహకారాలు అందించాలని ఆర్డీవో జె సీతారామారావు అన్నారు.మంగళవారం సాయంత్రం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ పై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనవరి నాటికి 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరు ఓటర్ గా నమోదు కావాలన్నారు.మరణించిన ఓటర్లు ,ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా తరలి వెళ్లిన ఓటర్లు ఓటర్ జాబితా నుండి తొలగించబడతాయన్నారు.ఈ తొలగింపు అప్లికేషన్లు రాజకీయ పార్టీల ప్రతినిధులకు పరిశీల నిమిత్తం అందజేశారు. ఈ సమావేశంలో వైయస్ఆర్సీపి తరపున జడ్పిటిసి గవరసాన సూరిబాబు,టిడిపి పట్టణ అధ్యక్షులు రంది సత్యనారాయణ,సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-రౌతులపూడి

మండల కేంద్రమైన రౌతులపూడి ఆర్ఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో మంగళవారం పాస్టర్స్ సంఘం ప్రతినిధులు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టిడిపి ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరుపుల సత్య ప్రభ హాజరై కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఉద్యోగాలను భర్తీ చేయాలి

ప్రజాశక్తి-కోటనందూరు

ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న 2.5 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు యనమల శివరామకష్ణ అన్నారు. మంగళవారం తునిలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్రంలో ఉద్యోగాలు లేక ఖాళీగా ఉన్న యువతీ యువకులు లక్షల సంఖ్యలో ఉన్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కాలయాపన సాగిస్తున్నారన్నారు. దీంతో యువతీ యువకులు ఉపాధి లేక వలసల బాట పడుతున్నారని విమర్శించారు. ఉపాధి లేక యువత వ్యసనాలకు బానిసలై విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. జనవరిలో జాబ్ క్యాలెండర్ ప్రకటించి డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి, ఖాళీగా ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.



ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

రాష్ట్రాభివృద్ధికి టిడిపిని గెలిపించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

రాష్ట్రాభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీని గెలిపించాలని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్ అన్నారు. మంగళవారం పెద్దాపురం మండలం రాయభూపాలపట్నంలో నిర్వహించిన భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా జగన్ పోవాలి- చంద్రబాబు రావాలి అనే నినాదంతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా టిడిపి ప్రకటించిన పథకాల కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు,టిడిపి నాయకులు మన్యం ప్రసన్న, పెనుమర్తి దొరబాబు, సానిపిని సురేష్, శ్రీను సుధీర్, దడాల దినేష్, పట్టా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పోషకాల గని కోడి గుడ్డు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కోడిగుడ్డులో అనేక పోషకాలు ఉన్నందున వాటిని సూపర్ గుడ్డుగా ప్రతి ఒక్కరు రోజు తీసుకోవాలని గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో లయన్స్ క్లబ్ కాకినాడ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక రోగులకు గుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడ్డులో 13 ముఖ్యమైన విటమిన్లు ఉన్నాయన్నారు. విటమిన్ ఎ, ఇ, బి- 5, బి-12, ఐరన్, అయోడిన్, ఫాస్పరస్ వంటివి ఉన్నాయని చెప్పారు. ప్రకృతి ప్రసాదించిన గుడ్డు సూపర్ ఫుడ్ అని సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేశ్వరరావు, అడబాల రత్నప్రసాద్, జి.కృష్ణమోహన్, రాఘవరావు, రాజా పాల్గొన్నారు.

వృద్ధులకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

క్రీస్తు బోధనలు ప్రపంచానికి మార్గదర్శకమని సిహెచ్.వెంకట్రావు పేర్కొన్నారు. రమణయ్యపేట దండుపుంత ఫుల్ గాస్పల్ మినిస్ట్రీస్ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన మాట్లాడారు. క్రిస్మస్ ప్రపంచ పండుగ అన్నారు. ప్రతి ఒక్కరూ కరుణ, ప్రేమ, శాంతి మార్గంలో నడవాలన్నారు. క్రీస్తు బోధనలను అనుసరించి ప్రతి ఒక్కరు పొరుగు వారిని ప్రేమ తత్వంతో ఆదరించాలని అన్నారు. అనంతరం అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో వద్ధులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.

విప్లవకారుడు ఉద్ధామ్ సింగ్

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

స్వాతంత్ర ఉద్యమంలో బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన ఉద్ధామ్ సింగ్ మహోన్నత విప్లవకారుడని రిటైర్డ్ టీచర్ నిమ్మకాయల వెంకటేశ్వరరావు ప్రస్తుతించారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఉద్ధామ్ సింగ్ జయంతి సందర్భంగా మంగళవారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలియన్‌వాలాభాగ్ హత్యాకాండకు సూత్రధారి అయిన జనరల్ డయ్యర్‌పై పగ పెంచుకొని 21 ఏళ్లు నిరీక్షించి ఆయనను ఉద్ధామ్ సింగ్ హతమార్చాడని చెప్పారు. ఆయనను బ్రిటీష్ ప్రభుత్వం ఉరి తీసే సమయంలో మరణంపై భయం లేదని, తన దేశం కోసం సంతోషంగా మరణిస్తానని చెప్పిన ధీరుడు ఉద్ధామ్ సింగ్ అన్నారు. అడబాల రత్న ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు సహకరించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు మంగళవారం నుంచి నిరవధిక సమ్మెలో ఉన్నందున పారిశుధ్య నిర్వహణలో ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర, సానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదు రాజు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీలో పని చేస్తున్న రెగ్యులర్ సిబ్బంది మాత్రమే పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారన్నారు. దీనివల్ల ఇంటింటి చెత్త సేకరణకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. డ్రైన్లలో, ఆరుబయట చెత్త వెయ్యకుండా ప్రజలు మున్సిపాలిటీకి సహకరించాలన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

వినియోగదారుల రక్షణకు చట్టాలు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

నగదు చెల్లించి వస్తువులు కొనడం లేదా సేవలు పొందడంలో వినియోగదారులకు ఏ నష్టం కలుగకుండా చట్టరీత్యా రక్షణ ఉందని జిల్లా వినియోగదారుల ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యులు కొమ్మూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏ వస్తువు కొన్నా లేదా నగదు చెల్లించి ఏ సేవ పొందినా వాటిలో లోపాలు ఉంటే మన ప్రాంతంలోనే వారిపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. సాంకేతిక పెరగడంతో నేడు డిజిటల్ లావాదేవీలు, టెలి మార్కెటింగ్, ఆన్‌లైన్ కొనుగోళ్లు పెరగడంతో ఏమైనా లోపాలు ఉంటే మన ప్రాంతంలోనే ఫిర్యాదు చేసే అవకాశాన్ని చట్టం కల్పించిందన్నారు. అడబాల రత్న ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చింతపల్లి సుబ్బారావు, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని హుండీల ఆదాయం రూ.2.7 కోట్లు

ప్రజాశక్తి-అన్నవరం

అన్నవరం సత్యనారాయణ స్వామి వారికి హుండీల ద్వారా రూ.2,07,80,492 ఆదాయం వచ్చింది. మంగళవారం కొండపైన దేవస్థానం ఇఒ రామచంద్ర మోహన్, చైర్మన్ ఐవి రోహిత్ ఆధ్వర్యంలో అధికారులు 26 రోజుల్లో వచ్చిన వివిధ హుండీల్లో వేసిన కానుకలు లెక్కించారు. ఈ లెక్కింపులో నగదుతో పాటు 32 గ్రాముల బంగారం, 85 గ్రాములు వెండి, వివిధ దేశాల చెందిన కరెన్సీ లభించినట్లు దేవస్థానం ఎకౌంట్స్ విభాగ అధికారి అనకాపల్లి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పాలక మండలి సభ్యులు, అధికారులు గత పురోహితులు శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

ఒరిజినల్ దస్తావేజు పోయినది

కొవ్వూరు పట్టణంకు చెందిన **వెల్లా రామారావు** గారి భార్య **కృష్ణవేణి** అను నాకు మంగళగిరి సబ్‌డివిజన్ తాడేపల్లి మండలం, తాడేపల్లి గ్రామం తాలూకు 12వ బ్లాకు సమీప డోరునెంబరు 12-462 నందు 242.5 చ॥గ॥ఖాళీ ఇంటి స్థలం కలదు. ఈ ఖాళీస్థలం మంగళగిరి సబ్‌రిజస్ట్రారు కార్యాలయంలో నెంబరు **3948/2005 Dt.28-4-2005** లో నా పేరునా రిజిష్టరు కాబడియున్నది. ఈ ఆస్థికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజు ది.**23-12-2023** తేదీన జిరాక్స్ నిమిత్తం కొవ్వూరులో గల మెయిన్ బజారుకు వెళ్ళుచుండగా మార్గమధ్యలో పడిపోయినది. ఈ దస్తావేజు దొరికిన వారు ఈ క్రింది చిరునామాకు సమాచారం అందించగలరు.

వెల్లా కృష్ణవేణి, W/o.రామారావు
డోరునెం.4-6-1/1, వెంకటేశ్వరస్వామి గుడి వీధి,
కొవ్వూరు, తూ.గో.జిల్లా. సెల్: 9642634799

వంగవీటి రంగాకు ఘన నివాళి

బడుగు బలహీన వర్గాలకు వంగవీటి మోహన రంగా అండగా నిలబడ్డారని పలువురు అన్నారు. ఆయన వర్థంతి సందర్భంగా మంగళవారం ఘనంగా నివాళులర్పించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడలో మాజీ ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు జిపిటి రోడ్డులోని రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వాసిరెడ్డి ఏసుదాసు, మల్లిపూడి వీరు, బుల్లోజు ఉమామహేశ్వర్, పిన్నమ్మరెడ్డి బుజ్జి, అగ్రవరపు సతీష్ పాల్గొన్నారు. **ఏలేశ్వరం** వైఆర్‌సి క్వార్టర్స్ ఆవరణలో రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. గోపు శ్రీనివాస్, గట్టెం వెంకటరమణ, రెడ్డి రాజు, జి.శేఖర్, గోళ్ల విజయ్, గొల్లపల్లి త్రినాథ్, సఖిరెడ్డి వంశీకష్ణ పాల్గొన్నారు. **రౌతులపూడి** కూరగాయల వెంకటరమణ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.

యానాం వార్తలు



నివాళులర్పిస్తున్న ఆర్ఎఒ మునిస్వామి

ఘనంగా జగన్నాథరావు జయంతి

ప్రజాశక్తి - యానాం

ఫ్రెంచ్ కాలంలో మేయర్‌గా పని చేసిన స్వాతంత్ర సమరయోధుడు యర్రా జగన్నాథరావుకు యానాంలో అధికారులు నాయకులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఆయన జయంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫెర్రీ రోడ్డులో ఆయన విగ్రహానికి ప్రాంతీయ పరిపాలన అధికారి ఆర్.మునిస్వామి, ఎస్‌పి రఘునాయిగన్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఖండవల్లి రామకృష్ణ, సుబ్బారాయుడు, మద్దింశెట్టి జీయన్న, కెఎల్‌వి.ప్రసాద్, చెక్కల అరుణ్ కుమార్, సీతారామరాజు, ముత్యాల బోస్ పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న ఎంఎల్‌ఎ కన్నబాబు

బిలీవర్స్ చర్చ్‌లో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి -కరప

నడకుదురులోని బిలీవర్స్ చర్చ్‌లో క్రిస్మస్ వేడుకల్లో కాకినాడ రూరల్ ఎంఎల్‌ఎ కురసాల కన్నబాబు పాల్గొని మాట్లాడారు. ఏసుక్రీస్తు చూపిన ప్రేమ మార్గం అందరికీ ఆదర్శప్రాయం అన్నారు. పాస్టర్స్ యునైటెడ్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ మేడపాటి రాజకుమార్ అధ్యర్యంలో జరిగిన ఈ వేడుకల్లో డాక్టర్ స్పర్జన్ బాబు, పండు ప్రేమ్ కుమార్, ఎస్ఎ.గాడ్విన్, జెడ్‌పిటిసి యాళ్ల సుబ్బారావు, ఎంపిపి పెంకే శ్రీలక్ష్మీసత్తిబాబు, యాసలపు దుర్గాప్రసాద్, వేళంగి గ్రామ సర్పంచ్ సవిలే నీలిమా రాజేష్, పబ్బినీడి చక్రరావు, యడ్ల కృష్ణ, పులిదిండి బాలసుబ్రహ్మణ్యం, జువ్వల చిన్నారావు, దాలిపర్తి శ్రీనివాసరావు, ఊబా రామచంద్రరావు, లంక చంద్రరావు, మెండు ఈశ్వరరావు, మెండు గోవింద్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి గురజనాపల్లి సైన్స్ ప్రాజెక్ట్

ప్రజాశక్తి-కరప

గురజనాపల్లి హైస్కూల్ విద్యార్థులు తయారుచేసిన సైన్స్ ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యిందని పాఠశాల హెచ్ఎం సాయి మోహన్ తెలిపారు. కాకినాడ మున్సిపల్ హైస్కూల్లో జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గురజనాపల్లి సైన్స్ ప్రాజెక్ట్ ఎంపికవడం ఆనందంగా ఉందని సాయి మోహన్ పేర్కొన్నారు. ఉప్పు రైతులు సంక్షోభంలో కూరికు పోవడంతో వారి జీవనోపాధికి ఆధారం లేక గుట్టుగా జీవిస్తున్నారని అనే కాన్సెప్ట్ మీద తయారుచేసిన ప్రాజెక్టు పలువురును ఆకట్టుకుందన్నారు. ఈ ప్రాజెక్టును తొమ్మిదో తరగతి విద్యార్థులు పి.హారిక, పి.వైష్ణవి, గైడ్ టీచర్ వివి.రమణమూర్తి, స్టాఫ్ సెక్రటరీ ప్రసాదరావు పాల్గొన్నారు.

పేదరికాన్ని జయించి ఎస్ఐ కొలువు

ప్రజాశక్తి - తాళ్లరేవు

కుటుంబానికి ఆసరాగా ఉన్న తండ్రి అకాలంగా మరణించినా, తమ్ముడు, తల్లి సహకారంతో పేదరికాన్ని జయించి ఆ యువకుడు ప్రభుత్వ కొలువు సాధించాడు. గాడిమొగ పంచాయతీకి చెందిన చెందిన కాలాడి రాజు ఇటీవల పోలీస్ శాఖలో ఎస్ఐ నియామకాల్లో విజయం సాధించాడు. తొలుత సిఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించిన రాజు ఎస్ఐ కావాలనే కోరికతో కానిస్టేబుల్ ఆ ఉద్యోగాన్ని విడనాడి పట్టుదలతో అనుకున్న లక్ష్యాన్ని సాధించాడు. తనకు వివాహమైనప్పటికీ తోటి యువకులతో పోటీపడి అందరికంటే ముందు వరుసలో నిలిచాడు. రాజును గ్రామ పెద్దలు, స్థానిక యువకుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కామాడి మాతరాజు, వైదాడి నూకరాజు, సీతారామరాజు, కర్రి బాబి, ధర్మారావు, మాతరాజు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్టాభివృద్ధి

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పిఠాపురం మాజీ ఎంఎల్‌ఎ టిడిపి అధికార ప్రతినిధి ఎస్‌విఎస్ఎన్.వర్మ అన్నారు. మంగళవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని అమరవల్లి, మూలపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్‌ఎ వర్మ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మత్స్యకారులకు ఉపయోగకరమైన తుపాను షెల్టర్లను సచివాలయంగా మార్చేశారన్నారు. ప్రజలకు జగన్మోహన్ రెడ్డి మోసపూరిత వాగ్దానాలు చేశారన్నారు. యువతకు ఉద్యోగాలు లేకుండా చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమానికి అలిశెట్టి సత్యానంద రెడ్డి, మెరుగు సూరిబాబు, కంబాల వెంకట రమణ, వాసపల్లి రాజారావు, సిద్ధి నాగు, చిలి ఉమా మహేశ్వరరావు, కండేపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నోటీసు

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 406/2012

Between:

1. శ్రీ ముత్తంగి బుచ్చిరామయ్య & 5గురు -వాద్దు

మరియు

1. శ్రీమతి పెరుగు పార్వతి (డైడ్)
2. శ్రీ పెరుగు పోతురాజు & 18 మంది ఇతరులు -ప్రతివాద్దు

(ప్రతివాద్దు 17 టు 20 లను ఐ. నెం. 518/2019 నందు ఇచ్చిన ఆర్డరు ప్రకారం ఈ దావా నందు 1వ ప్రతివాది వారసులుగా చేర్చడమైనది)

టు:

20వ ప్రతివాది: శ్రీమతి గంద్రోతు రత్నం, తండ్రి: లేటు గంద్రోతు వెంకట్రావు, నివాసం: జేగురుపాడు గ్రామం, కడియం మండలం, తూ॥గో॥జిల్లా.

పై నెంబరు దావాను వాదులు, ప్రతివాదులపై పర్మినెంట్ ఇంజక్షన్ ఉత్తర్వులు కోరుచూ దావాను దాఖలు చేసినందున సదరు దావాలో 20వ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించుచున్ననూ వాటిని మీరు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకంగా నిలువరించుచున్నారు. కావున, శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం **ది. 28-12-2023వ తేదీ ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి సమక్షమున స్వయంగా గాని, మీ న్యాయవాది గారి ద్వారా గాని హాజరు అయి, మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: 28-12-2023

కె.యస్.యస్.వి.జి.వి.ఆర్.మూర్తి
స్థలం: కొవ్వూరు అడ్వకేట్, కొవ్వూరు
తేది:20-12-23 సెల్: 9848616333